పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రుతుపవనాలు ముందుగానే వచ్చాయని వాతావరణ శాఖ తెలిపినప్పటికీ రెండు రోజులుగా ఎండలు మండు తున్నాయి. రోజూ 38 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదుఅవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి.వర్తక, వ్యాపార సంస్థలన్నీ 12 గంటలకి మూతపడుతున్నాయి. మధ్యాహ్నం సమయంలో ఎండల వేడికి తట్టుకోలేక పలువురు ప్రయాణికులు ప్రయాణాలను సైతం వాయిదా వేసుకుంటున్నారు.

నిర్మానుష్యంగా కోటిపల్లి, ద్రాక్షారామం రోడ్డు

ఉపాధి బకాయిలు చెల్లించాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది వ్యవసాయ కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, రూ.60 కోట్ల నిధులు తక్షణం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వందలాది మంది వ్యవసాయ కార్మికులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 7 వారాల నుంచి ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదని దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉపాధి బకాయిలు రూ.60 కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి చట్టాన్ని ఎత్తి వేస్తామని అంటున్నారని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు భూస్వాములు కూడ అదేమాట అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ పథకం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ చట్టాన్ని కాపాడుకుంటేనే కూలీలకు ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిపారు ఉపాధి కూలీలకు పనిదినాలు 200 రోజులు పెంచాలని, కూలి రేట్లు రూ.600 పెంచాలన్నారు. పే స్లిప్ గతంలో ఇచ్చే విధానం ఇప్పుడు కూడ ఇవ్వాలని ,కూలీలు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ రూ.5లక్షల ఇన్యూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెడికిట్లు టెంట్లు గునపం పారా లాంటి పని ముట్లు అందించాలని డిమాండ్ చేశారు .రెండు పూటలా మస్టార్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల మే 31న సిఎం చంద్రబాబు నాయుడు జిల్లాకి రావడం జరిగిందని ఉపాధి కూలీలతో ప్రచారం నిమిత్తం ముచ్చట్లు ఆడడం జరిగిందని అన్నారు. కానీ వారి సమస్యను పట్టించుకోలేదని వేతన బకాయిలు ఇప్పించాలని ఇప్పిస్తామని కూడా సిఎం చంద్రబాబు స్పృహ లేదని అన్నారు. కనీసం సిఎం చంద్రబాబు అనేక పథకాలు ఇస్తానని హామీ ఇచ్చారని ఆ పథకాలు ఏమీ మాకు అవసరం లేదు మేము చేసిన పనికి కనీసం డబ్బులు అయినా ఇప్పించండి అని ధర్నాకు వచ్చినటువంటి మహిళ కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి డబ్బులైన ఇప్పించండి తిండైనా పెట్టండని పెద్ద ఎత్తున కూలీలు నినాదాలు చేశారు ఈ ధర్నాకి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. మేట్లకు పారితోషం రూ.10 ఇవ్వాలని, సెల్‌ఫోన్ డేటా ఛార్జీలు ప్రభుత్వ భరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన ప్రకారం కూలీలు అందరికి ఆరునెలల పాటు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రం మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పశ్చిమాల శివ, జి.దైవవాణి తదితరులు నాయకత్వం వహించుగా వందలాది మంది ఉపాధి కూలీలు, మేట్లు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద కార్మికుల ధర్నా

అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -అమలాపురం

అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. సోమ వారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జెసి టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, డిఆర్‌డిఎ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ, సర్వ శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.మమ్మీ అర్జీదారుల నుండి సుమారుగా 212 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్య ల పరిష్కారానికి అధికారు లు ప్రత్యేక దృష్టి సారించి నిర్దిష్ట కాలపరి మితిలో పరిష్కరిస్తూ పిజిఆర్ఎస్ వ్యవస్థ పట్ల అర్జీదారులలో విశ్వస నీయతను పెంపొందించాలన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు .ఫిర్యాదుదారుడు తన అర్జీ స్థితిని ఆన్లైన్ పోర్టల్ ద్వారా లేదా1100 కాల్ చేస్తూ తెలుసుకోనవచ్చునన్నారు. అధికారులు సమస్యల పరిష్కార బాధ్యతను జవాబుదారీతనంతో చేపట్టి పనితీరును మెరుగుపరు చుకొని ప్రభుత్వ ఆశయ సాధన దిశగా సుపరిపాలన అందించాలన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజా సమస్యలను నేరుగా స్వీకరించి సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ సేవలు మెరుగుపడతాయనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వ్యవస్థను నెలకొల్పిందన్నారు. సమస్య పరిష్కారం అయిన తర్వాత ప్రజల నుంచి అభి ప్రాయాలను ఐవిఆర్ఎస్, ఆర్‌టిజిఎస్ ద్వారా సేకరించి, వ్యవస్థలో నాణ్యత సంతప్తి కొలమాన స్థాయిలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను తీసుకుందన్నారు. ఫిర్యాదుల పరి ష్కారంలో జాప్యం జరిగినా లేదా నాణ్యత లేని పరి ష్కారం జరిగినా తక్షణమే జోక్యం చేసుకునే బలమైన పర్యవేక్షణ వ్యవస్థ నేడు అందుబాటులో ఉందన్నారు. కావున అధికారులందరూ అత్యంత జాగరూకతతో అర్జీల పరిష్కారం పట్ల వ్యవహరించాలని లేనిపక్షంలో అర్జీలు పునరావతం అవుతాయని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలు ప్రజలకు, ప్రభు త్వానికి మధ్య వారధిగా పని చేస్తూ సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా మంచి పరిపాలన అందించడానికి అవకాశాలు మెరుగుపడ తాయన్నారు. జెసి కలెక్టర్ మాట్లాడుతూ అంతర్వేది బీచ్ నందు ఈనెల మూడో తేదీ యోగ అభ్యసన గ్రాండ్ ఈవెంట్ నిర్వహించ డానికి వివిధ శాఖలకు చెందిన సిబ్బందిని తరలించాలని ఆదేశించారు. తప్పనిసరిగా సిబ్బంది అంతా యోగ అభ్యసన కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. శాఖల వారిగా సిబ్బంది తరలింపు కొరకు లక్ష్యాలను ఆమె నిర్దేశించారు. కార్యక్రమంలో ఎస్‌డిసి పి.కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, డిఇఒ షేక్ సలీం బాషా, డిఎస్‌డిఒ ముఖ్య శిక్షకులు పిఎస్ సురేష్ కుమార్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమారి, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డిఐపి ఆర్ఒ కె.లక్ష్మీనారాయణ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

గ్రీవెన్స్‌లో 5 అర్జీలు

రామచంద్రపురం: ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నందు 5 అర్జీలు వచ్చాయని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్రమణ తొలగించవలసినదిగా 1, రీ సర్వే తప్పులు సరిచేయవలసినదిగా1, భూమి స్వభావం మార్పు చేయవలసినదిగా1, కిట్స్ ఇంజనీరింగ్ ఉద్యోగులకు జీతములు ఇవ్వవలసినదిగా1, కేశవరం పాఠశాల పడగొట్టి అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా చేయవలసినదిగా ఒకటి మొత్తం ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు.

4న ఉషాకిరణ్ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక ఉషా కిరణ్ ఐటిఐ కళాశాలలో వికాస ఆధ్వర్యంలో ఐటిసి లిమిటెడ్ ఫుడ్ డివిజన్ సౌజన్యంతో జూన్ 4న జరిగే జాబ్ మేళాను నిర్వహి స్తారని కళాశాల కరస్పా ండెంట్ మట్టా త్రిమూర్తులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జాబ్ మేళాలో 40 ఖాళీలకు ఎంపిక జరగనున్నదని, ఎంపికైన వారికి మొదటి ఏడాది అప్రెంటిస్ షిప్‌గా నెలకు రూ.11వేలు, రెండో ఏడాది రూ.25000 ఇస్తారన్నారు. ఉషాకిరణ్ ఐటిఐ కాలేజ్ కరస్పాండెంట్ మట్టా త్రిమూర్తులు తెలిపారు. ఐటిఐ, ఇంటర్ వొకేషనల్ చదివిన వారు అర్హులని అన్నారు. ఈ జాబ్‌మేళానున ద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భీమనపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషుకుమార్ అధ్యక్షతన వేసవి శిక్షణ తరగతుల కార్యక్రమంలో విద్యార్థులకు భాగంగా యోగా శిక్షణ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం మాట్లాడుతూ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డైరెక్టర్ రామం, ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ నల్లా నరసింహమూర్తి, విశ్రాంత భవిష్య నిధి అసిస్టెంట్ కమిషనర్ అద్దంకి అమరేశ్వర రావు తదితరులు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ నైపుణ్య నిపుణులు కడలి శ్రీనివాసరావు,పెద్దింటి గీత, దేశంశెట్టి మల్లికా, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పరిసరాలు పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉంటామని ఆత్రేయపురం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, హైమశ్రీ అన్నారు. సోమవారం మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పిహెచ్‌సి దగ్గర మొదలుపెట్టి బస్టాండ్ వరకు కొనసాగింది. అనంతరం ఈ మలేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిల్లి సూర్యప్రకాష్

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, సూపర్ సిక్స్ హామీలను అమలు పరచనందుకు నిరసనగా ఈనెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమానికి వైసిపి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి సంబంధి ంచిన వైసిపి రామచంద్రపురం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ తన కార్యాలయంలో సోమవారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి రామచంద్రపురం ఆర్‌డిఒ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి వినతిపత్రం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు అంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి అభిమానులు కార్యకర్తలు పాల్గొనాలని విజ్ఞప్తి ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోనసీమ రైతు పరిరక్షణ సంఘం అధ్యక్షులు యాళ్ల బ్రహ్మానందం అన్నారు. ఈ మేరకు గొల్లవిల్లిలో సోమవారం ఆయన బ్రహ్మానందం అధ్యక్షతన రైతు సమావేశం నిర్వహించారు.ఈ రబి సీజన్ లో గత నెల 8 తరువాత రైతులు ఆర్ఎస్‌కె ల ద్వారా అమ్మిన ధాన్యం సొమ్ములు విడుదల చేయలేదన్నారు. రైతుల ధాన్యం అమ్మకాలు జరగక ఇంకా కళ్ళాల్లోనే ఉండిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని ఆర్ ఎస్‌కెలకు వెళ్లి అడిగితే టార్గెట్‌లు అయిపోయాయని చెబుతున్నారని అన్నారు. గ్రామాల్లో ఇ క్రాప్ నమోదు చేసిన ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తడిచిన రంగు మారిన ధాన్యాన్ని ఎంఎస్ పి ధరకే కొనుగోలు చేసి ధాన్యం బకాయి సొమ్ములను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా పంట కాలువలను ఆధునికీకరించకపోవడంతో వరిచేలకు సాగునీరు అందక నష్టపోతున్నామన్నారు.ఈ వేసవి క్లోజర్ సమయంలో పంట కాలువలు పిల్ల కాలువల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఖరీఫ్ సాగు చేసేందుకు రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అలాగే మైనర్ మీడియం రెవెన్యూ మురుగు కాలువల్లో గుర్రపు డెక్క తొలగించలేదని దీంతో నారుమడులు వేస్తే తొలకరి వర్షాలకు మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. మురుగు కాలువల్లో వలకట్లను గుర్రపు డెక్క, తూడు తొలగించి పంట పొలాలను ముంపు నుంచి కాపాడాలని అన్నారు. సమావేశంలో సాగునీటి సంఘం అధ్యక్షులు నల్లా సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, అడ బాల సత్యనారాయణ, చిక్కం పెద్దబ్బులు, ఉండ్రు వెంకట సుబ్బారావు, దంగుడుబియ్యం గంగరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, రాయపురెడ్డి స్వామి నాయుడు, మంచెం బాలకృష్ణ, కొప్పిశెట్టి శ్రీనివాసరావు, మంగెన వెంకట నరసింహారావు, మోటూరి విశ్వనాథం, సలాది సూరిబాబు, గుత్తుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మానందం

మిడ్డే మీల్స్ నిర్వాహకులకు శిక్షణ

ప్రజాశక్తి - అయినవిల్లి

స్థానిక ముక్తేశ్వరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండలములోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు ఈ శిక్షణా కార్యక్రమానికి కోర్సు డైరక్టర్ా మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు వ్యవహరి ంచారు. జిల్లా యమ్‌డియమ్, ఎడి యన్.సురేష్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఇక నుంచి అన్ని పాఠశాలలకు సన్నరకం బియ్యం పంపిణీ చేస్తామని అన్నారు. కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డించాలన్నారు. ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ నెల ఐదు నుంచి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి పాఠశాలల రోల్ పెంచడానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పెచ్చెట్టి శ్రీనివాస్, రిసోర్సు పర్సన్ గుబ్బల సాయి శ్రీనివాస్, సిఆర్‌పిలు సౌదామణి, రాంజీ, చందు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముక్తేశ్వరం జడ్‌పి ఉన్నత పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్న అధికారులు

కొత్తపేట: మండలం లోని 83 పాఠశాలకు సంబంధించి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పాథకం కుక్, హెల్పర్ లకు ఒకరోజు శిక్షణా కార్యక్తమము జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మండల విద్యా శాఖాధికారి-2 కె.లీలావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు శుచిగా, రుచిగా భోజనం అందించాలని తెలియజేశారు. హెల్త్ డిపార్టుమెంటు వారు కుక్, హెల్పర్ లకు పరిశుభ్రత, పౌష్టిక ఆహారం గురించి సూచనలు ఇచ్చారు. ఫైర్ డిపార్టుమెంటు వారు గ్యాస్ పొయ్యిపై వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదాలు జరగకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. అనతరం కుక్, హెల్పర్ లకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో హెల్త్ డిపార్టుమెంటు నుండి ఎంపిహెచ్‌పి వి.సద్గురు రావు, ఎమ్ఎల్‌హెచ్‌పి విడి.లక్ష్మి, ఎఎన్ఎంలు, ఫైర్ డిపార్టుమెంటు నుంచి ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, స్టాఫ్, స్టేట్ నందు శిక్షణ పొందిన అర్‌పిలు కె.విజయ కుమారి, వి.భవాని, జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలోని మాట్లాడుతున్న అధికారులు

జల్‌జీవన్ పథకం పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జిల్లాలోని 22 మండలాల ఆవాసాల ప్రాంతాలలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న పనులను కేంద్ర బృందం పరిశీలించింది. కేంద్ర బృందం సోమవారం ఆత్రేయపురం మండలం వచ్చారు. సెంట్రల్ నోడల్ ఆఫీసర్ పూర్ణ చంద్ర కిషన్ ఐఎఎస్, టెక్నికల్ ఆఫీసర్ జల్ జీవన్ (సాంకేతిక సలహదారులు) బి.విశ్వదీప్ దాసు మండలంలోని వసంత వాడ గ్రామంలో పర్యటించి పనులు తనిఖీ చేశారు. అనంతరం ప్రజలతో మమేకమై వారితో మాట్లాడి తాగునీటి గురించి ఆరా తీశారు. బృందం మాట్లాడుతూ శివారు ప్రాంత ప్రజలు గతంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడేవారిని జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయడంపై ఆవాసాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా సూపరింటెండెంట్ వి.కృష్ణారెడ్డి, కాకినాడ పరివేక్షకులు భారతి, తూర్పుగోదావరి జిల్లా, సూపరింటెండెంట్, వెంకట గిరి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎస్.రవికుమార్, డి.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, శ్రీనివాస్‌బాబు పద్మనాభం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, శ్రీధర్, ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట రామన్, డిప్యూటి ఎంపిడిఒ యు.చంద్ర శేఖర్, గ్రామ సర్పంచ్ గాదిరాజు రామకృష్ణ రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ. వై.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వసంతవాడ గ్రామంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

చిరంజీవినీకుమారి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆలమూరు

ఐడియల్ కళాశాలల అధినేత, ప్రముఖ రచయిత్రి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మృతి సాహిత్య లోకానికి తీరని లోటని, ఆమె సేవలు అమోఘమని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.శ్యామ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సమత కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ డాక్టర్ చిరంజీవినీకుమారి బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. విద్య, సాహిత్య, రాజకీయ రంగాలలో సుదీర్ఘకాలం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి అన్నారు. ఆనంద్ మాట్లాడుతూ ఆమెకు సమత స్వచ్ఛంద సేవా సంస్థతో ఎంతో అనుబంధం ఉందని, సమత కార్యక్రమాల్లో ఎన్నోసార్లు పాల్గొని తమ సందేశాలు ఇచ్చారని, కాకినాడలో ఆమె నడిపించిన కళాశాలలో చదువుకుని ఎంతో మంది ఉన్నత స్థానానికి వెళ్లారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ మాట్లాడుతూ ఆమె జీవితం ఆదర్శప్రాయమని, సమాజ సేవకు అంకితమయ్యారని, వామపక్ష భావజాలంతో మెలిగారన్నారు. ఆమె మృతికి సిపిఐ, ఎఐఎస్ఎఫ్, ప్రజానాట్యమండలి, సమత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తుందని, ఆమెకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సమత మేనేజర్ రాము, అకౌంటెంట్ సురేష్, ఫీల్డ్ ఆర్గనైజర్స్ సహవాసరావు, వరలక్ష్మి, నాగమణి, సుహాసిని, రత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరంజీవినీ కుమారి చిత్రపటం వద్ద వివిధ సంఘాల నాయకుల నివాళి

ఉద్యోగ విరమణ చేసిన వారికి సత్కారం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు సోమవారం ఉద్యోగ విర మణ పొందిన 4 ఉద్యోగుల ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ బాధ్యతాయుతంగా ఉద్యోగం లో పనిచేసినప్పుడు జీవితంలో ఎంతో సంతప్తిని కలుగజేస్తుందని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జిల్లా ఆర్థిక గణాంకాధికారి పి.వెంకటేశ్వర్లు, ఉప గణాం కాధికారి ఆర్.శంకర్రావు, రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ ఎస్.ప్రసాద్, కపిలేశ్వరపురం తహశీల్దార్ పి.చిన్నా రావులను కలెక్టర్ శాలువాలతో సత్కరించి మెమెంటో బహు కరించారు. కలెక్టర్, జెసి టి.నిషాంతి, డిఆర్ఒ రాజ కుమారి, ఎఒ కాశీ విశ్వేశ్వర రావులతో ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులు తమకున్న అనుభూతిని పంచుకోవడం తోపాటుగా ప్రభుత్వ సర్వీసు లో ఏయే ప్రాంతాలలో ఏ యే క్యాడర్లలో పనిచేసిన వివరాలను తెలియజేశారు.

సన్మానిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, పాల్గొన్న జెసి

చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

బాధితునికి మంత్రి రూ.20 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి గ్రామానికి చెందిన గంటి శివ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ, మంచానికే పరిమిత మయ్యాడు. అతని ఆర్థిక, ఆరోగ్య పరిస్థితిని కూటమి పార్టీ నాయకులు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సుభాష్ తక్షణం స్పందించి బాధితుని ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. బాధితుడు శివ భార్యకు రూ.20 వేల చెక్కును అందించారు. తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి గ్రామ టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఇఇలో వెంకటరాజు ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. సందిపూడి గ్రామ సర్పంచ్ తోట భవాని, వెంకటేశ్వర్లు తనయుడు వెంకటరాజు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రతిభ కనబరిచారు. ఆలిండియా స్థాయిలో ఓపెన్ క్యాటగిరి ద్వారా ఓవరాల్‌గా 1533వ ర్యాంకు, జిఇఎన్ - ఇడబ్ల్యూఎస్ కేటగిరిలో 135వ ర్యాంకు సాధించారు. వెంకటరాజు మాట్లాడుతూ ఐఐటీలో సీటు సాధించి ఇంజినీరింగ్ పూర్తి చేసి తల్లిదండ్రుల కలను నెరవేర్చడమే తన లక్ష్యమని తెలిపారు. మండల పరిధిలోని పలువురు రాజకీయ నాయకులు, మండల అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు వెంకటరాజును అభినందించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం రామచంద్రపురం తహశీల్దార్ కార్యాలయం దగ్గర సిపిఐ నాయకులు ధర్నా నిర్వహించారు. పెద్దిరెడ్డి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పేదలందరికీ పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని ఇస్తామన్న ప్రభుత్వ హామీ ప్రకారంగా వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎస్.శారదా దేవి, వి రాంబాబు, ర్యాలీ సత్తిబాబు, లబ్ధిదారులు కె.దుర్గ, పి.కృష్ణవేణి, జె.వెంకటరమణ, టి.లక్ష్మీ కాంతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహశీల్దార్ కార్యాలయంలో అందజేశారు.

కార్టూ'నిజం'

పూడికతీత పనులు పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి – అమలాపురం

గోదావరి డెల్టాలో కాలువలు మూసివేత సమయంలో చేపట్టిన షట్టర్ రిపేర్లు, పూడికతీత పనులను 10 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జల వనరులు, డ్రెయినేజీ విభాగపు ఇంజినీర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జల వనరులు, డ్రెయినేజీ విభాగపు ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి మరమ్మతు పనులు, గుర్రపు డెక్క పూడికతీత పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలువలలో చిట్ట చివరి ఆయకట్టు వరకు సాగు నీరు సవ్యంగా పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా డ్రైనేజీలలో మురుగునీరు దిగువకు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. టువంటి ముంపు వాటిల్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. మేజర్ పనులను నీటి వినియోగదారుల సంఘాల ప్రాజెక్ట్ కమిటీలకు చిన్న పనులను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు నామినేషన్ పద్ధతిన కేటాయించాలన్నారు. గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని అమలాపురం నియోజకవర్గంలో జల వనరుల శాఖకు సంబంధించి 34 పనులు, కొత్తపేట నియోజకవర్గంలో 29 పనులు, ముమ్మిడివరం నియోజకవర్గంలో 24 పనులు, పి.గన్నవరం నియోజకవర్గంలో 27పనులు, రాజోలు నియోజకవర్గంలో 31 పనులు వెరసి ఐదు నియోజకవర్గాలలో 145పనులు రూ.168.76 లక్షలతో చేపట్టినట్లు తెలిపారు. డ్రెయినేజీ డివిజన్‌కు సంబంధించి అమలాపురం నియోజకవర్గంలో 45, కొత్తపేట నియోజకవర్గంలో 20, పి గన్నవరం నియోజకవర్గంలో 25, రాజోలు నియోజకవర్గంలో 25, రాజోలు నియో జకవర్గంలో 23, ముమ్మడివరం నియోజకవర్గంలో 30, రామచంద్రపురం నియోజకవర్గంలో 27, మండపేట నియోజకవర్గంలో 25, వెరసి 195 పనులుకు గాను రూ.812.88లక్షలతో చేపట్టినట్టు తెలిపారు. గుర్రపు డెక్క పూడికతీత పనులను మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. షట్టర్ మరమ్మతులు పనులు ఉద్యమ రూపంలో పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు రానున్న ఖరీఫ్ సీజన్లో ఎటువంటి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మురుగునీరు వల్ల పంటలు ముంపుకు కాకుండా అన్ని చర్యలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ బి శ్రీనివాస రావు, డ్రైనేజీ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎంవివి.కిషోర్, డివిజనల్ సహాయ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కోనేరులో తండ్రీ కొడుకుల మృతి

ప్రజాశక్తి – గండేపల్లి

మండలంలోని తాళ్లూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో సోమవారం మండలంలో బొర్రంపాలెం గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు సాగి నల్లబాబు(49), కుమారుడు సాయి సంజయ్‌శ్రీరామ్ (19) స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మృతి చెందారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. తొండంగి మండలం వలసపాకలకు చెందిన బంధువు మృతి చెందడంతో పరామర్శకు తండ్రి కొడుకులు ఇద్దరు వెళ్లారు. తిరిగి వస్తూ కోనేరులో స్నానాన్ని వెళ్లగా ప్రమాదవశాత్తు కోనేరులో గల్లంతయ్యారు. స్థానికులు రక్షించే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. అప్పటికే తండ్రి కొడుకులు ఇద్దరు మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జగ్గంపేట సిఐ వైజికె.శ్రీనివాస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వైజికె.శ్రీనివాస్ వెల్లడించారు. ఇదిలావుండగా తండ్రి కొడుకులు మృతితో బొర్రంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన సంజయ్‌శ్రీరామ్ వైజాగ్‌లో రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడు. బంధువులను పరామర్శించడానికి వెళ్ళిన శ్రీరామ్ ఈ విధంగా మృతి చెందడం కుటుంబీకులను కలచివేసింది.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి – రాజానగరం

రాజానగరం సమీపంలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న పరుచూరి ప్రగతి(19) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా సర్వేపల్లి మండలం గుడ్లూరుకు చెందిన ప్రగతి గైట్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం నుంచి రెండో సెమిస్టర్ తరగతులు ప్రారంభం కావడంతో ప్రగతి స్వగ్రామం నుంచి ఆదివారమే వసతిగృహానికి చేరుకుంది. అప్పటి నుంచి హాస్టల్ గదిలో ఒక్కతే ఉంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. మొదటి సెమిస్టర్‌లో నాలుగు పరీక్షలు ఫెయిల్ అయ్యిందని, దీంతో మానసిక ఒత్తిడికి గురై మృతి చెందినట్లు అక్కడ దొరికిన సూసైడ్ నోట్ ఆధారంగా తెలిసిందని ఎస్ఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపారు. దుప్పటి అడ్డుగా ఏర్పాటు చేసుకుని బట్టలు ఆరేసుకునే హుక్కుకు చున్నీని బిగించుకుని ఉరివేసుకుందని పోలీసులు తెలిపారు. సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపారు.

1,880 కేజీల 'పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-కడియం

బుర్రిలంక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 1,880 కేజీల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వాహన యజమాని పి.దొరబాబు, డ్రైవర్ కాళేశ్వర్లుపై కేసు నమోదు చేసామన్నారు. వారిరువురూ బుర్రిలంకకు చెందిన వారని ఆయన తెలిపారు. అలాగే బియ్యాన్ని ఎంఎస్‌ఓ ప్రభాకర్‌కు అప్పగించామన్నారు.

బండారులంకలో 40 బస్తాలు..

ప్రజాశక్తి – అమలాపురం రూరల్

బండారులంకలో సోమవారం రేషన్ బియ్యం 40 బస్తాలఅక్రమంగా తరలిస్తుండగా అమలాపురం రూరల్ పోలీసులకు పట్టుబడింది. ఈ సమాచారం మేరకు పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

ప్రజాశక్తి – నిడదవోలు రూరల్

మండలంలోని సమిశ్రగూడెం బ్రిడ్జి కూడలి వద్ద ఆదివారం అర్ధరాత్రి తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ ఎల్.సుందర్‌బాలాజీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక లోడుతో అతి వేగంగా వాహనాలు నడపడంతో పాటు లైసెన్సులు, హెల్మెట్లు లేకపోయినా చర్యలు తప్పవన్నారు.

రెండు డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

ప్రజాశక్తి – కొవ్వూరు

పట్టణ శివారులో ఉన్న దండగుండ ర్యాంపులో గోదావరి నది నుండి అక్రమంగా డ్రెడ్జింగ్ చేస్తున్న రెండు పడవలను సీజ్ చేసినట్లు ఆర్‌డిఓ సుస్మిత రాణి తెలిపారు. నదిలో నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలను వినియోగించి ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందించిందన్నారు. ఈ మేరకు దాడులు చేసి బోట్లను సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మనుషులతో మాత్రమే ఇసుకను తవ్వి, తరలించాలన్నారు. కాని ఇక్కడ ర్యాంపులో యంత్రాలను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పడవలను సీజ్ చేసి, బిఎజాలమణికంఠను ఆదేశించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, టాస్కుఫోర్స్ ఎస్ఐ అంజనేయులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి – గండేపల్లి

మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన ముగ్గిన నాగేశ్వరరావు(34) ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై సోమవారం ఉదయం గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న క్రమంలో పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి – అమలాపురం

క్షయవ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని అప్ర మత్తంగా ఉండాలని, ఒక ముఖ్యమైన జాతీయ కార్యక్రమమనికలెక్టర్ ఆర్ మహేష్ కు మార్ ప్రజలకు పిలుపు నిచ్చారు సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్ నందు టిబి ముక్త భారత్ అభియాన్ క్రింద జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిం చారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రపంచ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గడువు నాటికి భారతదేశం నుంచి టిబిని పూర్తిగా అంతం చేయడం ఈ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. టిబి నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడం ద్వారా ప్రజలందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు ఆశాలు, ఎఎన్ఎంలు వైద్యాధికారుల బృందాల ద్వారా అను మానిత వ్యక్తులను సమీకరించి నిక్షయ్ నమోదు స్క్రీనింగ్ చేస్తూ పాజిటివ్ కేసులకు క్షయ వ్యాధి చికిత్స అందిం చాలన్నారు టిబి ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించడం, రోగ నిర్ధారణ అయితే ఉచిత మందులతో పాటు పోషణ భత్యం అందిం చడం. వ్యక్తిగత దాతలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్లు వంటి వారు టిబి రోగులను దత్తత తీసుకొని వారికి పోష కాహార, చికిత్స, వత్తిపర మైన సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి.భరత లక్ష్మి, వైద్య సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్

ప్రజాశక్తి – ఆలమూరు

పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని సిపిఐ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన ఆలమూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు వంతున ఇళ్ల స్థలాలు ఇస్తామని, అదే విధంగా రూ.4 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావచ్చిన ఇంతవరకు ఈ హామీ నెరవేర్చలేదన్నారు. మండలంలో సిపిఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించగా వందలాది కుటుంబాలు ఇళ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నట్లు తేలిందన్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు ఇచ్చిన వారి జాబితా తాము అధికారులకు అందజేస్తామన్నారు. పేదలకు సొంత స్థలం, ఇల్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాల కోసం అధికారుల చుట్టూ నిత్యం తిరుగుతున్నప్పటికీ వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అందుకే సిపిఐ ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఎన్నికల హామీ నెరవేర్చాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణంలో రూ.5 లక్షలతో పాటుగా ఉచిత ఇసుకను అందించాలన్నారు. లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధతం చేస్తామన్నారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ లో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిడిఒ ఎ.రాజుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వి.శ్యామ్, జి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్‌ఎ ముప్పిడి పరామర్శ

ప్రజాశక్తి – చాగల్లు

ఇటీవల రాజానగరం సమీపంలో గామన్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాగల్లు మండలం మార్కొండపాడు గ్రామానికి చెందిన ఇమ్మని వీరవెంకటసత్యవతి,. ఉప్పులూరి శివలీల, ఉప్పులూరి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం పరామర్శించారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. మృతులకు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కొవ్వూరు ఎఎంసి చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, కూటమి నాయకులు ఉన్నారు.

శైలజ కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి-కడియం

మాతృ వియోగంతో బాధపడుతున్న కడియం మండల వైసిపి మహిళా విభాగం నాయకురాలు పూటుకూరి శైలజ కుటుంబాన్ని సోమవారం పలువురు నాయకులు పరామర్శించారు. ముందుగా బీరకా సూర్యావతి చిత్రపటానికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఈలి గోపాలం, సర్కార్ భాషా, పున్నమరాజు వీర్రాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కడియం

బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం బాల్యవివాహాల నిరోధంపై అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపిపితో పాటూ ఎంపిడిఒ రమేష్, ఎసిడిపిఒ టి.కనకవల్లి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి క్రాంతి లాల్, క్రాఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ బి.రాజకుమార్ పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం అందరూ సహకరించాలన్నారు. బాల్య వివాహాలు రహిత మండలంగా కడియంను తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల యోగాంధ్ర

ప్రజాశక్తి – యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల యోగాంధ్ర కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల్లో అధికారులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. **ఆలమూరు**: యోగా నిత్య సాధనలో భాగం కావాలని ఇన్చార్జి డిఎల్పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు, తహశీల్దార్ కె.జె.ప్రకాష్ బాబు పేర్కొన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర డే కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. **రామచంద్రపురం**: రామచంద్రపురం రూరల్ లోని 21 సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం 9 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి కె.పద్మ జ్యోతి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. **రావులపాలెం:** మండలంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పరిధి పొడగట్లపల్లి బెజవాడ గోపాలరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల లో ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగసత్యవేణి అధ్యక్షతన యోగాంధ్ర లో భాగంగా రంగోళి కార్యక్రమంలో ముగ్గులు పోటీలు ఏర్పాటు చేశారు. **ఐ.పోలవరం:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయి యోగాంధ్ర ముగ్గుల పోటీలు ఐ. పోలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు .స్థానిక తల్లులు, కిషోర బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు సిహెచ్ నాగలక్ష్మి, జె మీనాక్షి, ఎన్‌జిఒ సంస్థ డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు, హైస్కూల్ సిబ్బంది,గ్రామ పంచాయితీ కార్యదర్శి జిఎస్‌విఎస్.మూర్తి పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి – పెరవలి

మండలం ముత్యాలవారిపాలెం గ్రామానికి చెందిన గంటా తేజ నవీన్ కుమార్(29) అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. తణుకులో గిఫ్ట్ ఆర్టికల్స్ షాప్ నడుపుతున్నాడని, కుటుంబ అవసరాల రీత్యా రూ.25 లక్షలు వరకు అప్పులు చేశాడని పోలీసులు తెలిపారు. అప్పుల వారు ఒత్తిడి చేయడంతో తేజ నవీన్ కుమార్, భార్య ప్రసన్న , కుమారుడు వీనీత్‌తో కలిసి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796642, 9154875611 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఎంఎల్ఎ వెంకట్రావుకు స్వామివ వారి చిత్రపటం అందజేస్తున్న పర్యవేక్షకులు

బాల బాలాజీస్వామిని దర్శించుకున్న గన్నవరం ఎంఎల్ఎ

ప్రజాశక్తి – మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామివారిని కష్ణాజిల్లా గన్నవరం ఎంఎల్ఎ యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సమేతంగా విచ్చేసి సోమవారం దర్శించుకున్నారు వారికి ఆలయ అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. అనంతరం శేషవస్త్రంతో వేదాశీర్వచనం నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు సత్యమూర్తి ఎంఎల్ఎ దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీనీ పరిష్కరించాలని కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. మొత్తం 25 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజినీరింగ్ శాఖకు సంబంధించి 10, రెవెన్యూకి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 4, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 7, వార్డు సచివాలయాలకు సంబంధించి 2 అర్జీలు ఉన్నాయి. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. మానవీయ కోణంలో సమస్యలను చూడాలని.. వాటి పరిష్కారంలో క్వాలిటేటివ్ డిస్పోజల్ చాలా ముఖ్యమని తెలిపారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా ప్రతి సమస్యనూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఇ ఎంసిహెచ్.కోటేశ్వరరావు, మేనేజర్ ఎమ్‌డి.అబ్దుల్‌మాలిక్, ఎంహెచ్ఒ వినూత్న, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు పిజిఆర్ఎస్ కు 25 ఫిర్యాదులు

పోలీసు పిజిఆర్ఎస్‌కు 25 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి ఆదేశాలు మేరకు అడిషనల్ ఎస్పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడారు.

4న 'వెన్నుపోటు దినం'

ప్రజాశక్తి – మామిడికుదురు

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 4న వెన్నుపోటు దిపం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పేర్కొన్నారు పాశర్లపూడిలో మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు స్వగృహం వద్ద సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న పి గన్నవరంలో ప్రభుత్వ వైఫల్యాలపై నిర్వహించే వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు కశిరెడ్డి అంజిబాబు, తులా గోపాలకష్ణ, తోరం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న తహశీల్దార్ మృత్యుంజయరావు

మృతుని కుటుంబానికి రూ.2 లక్షల సాయం

ప్రజాశక్తి – కె.గంగవరం

శేరిలంక గ్రామంలో ఇటీవల గోదావరి లో మునిగి ఎలిపే మహేష్ మరణించాడు. మృతుని కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్కును తహశీల్దార్ బండి మత్యుంజయరావు సోమవారం అందజేశారు. ఇటీవల గోదావరి నదిలో 8 మంది పిల్లలు మునిగిపోయి మరణించారు ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలంటూకలెక్టర్ మహేష్‌కుమార్‌కు సిఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం శేరులంక గ్రామంలో మతుడు మహేష్ తల్లి ఎలిపే వెంకటలక్ష్మిని కలిసి, మనోధైర్యం కల్పించారు. అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కు తహశీల్దార్ మృత్యుంజయరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, గ్రామ సర్పంచ్ కొండేపూడి భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన కాలువ పూడికతీత పనులు

ప్రజాశక్తి – ఆలమూరు

పనులు పరిశీలిస్తున్న చినబాబు తదితరులు

పెనికేరు బొడ్డు మురుగు నీటి కాలువ అధ్వానంగా ఉండడంతో వర్షాకాల సమయంలో అధిక వర్షపు నీరు నిలిచిపోయి పంట పొలాలు మునిగి పోతున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఈదర శ్రీరామచంద్రమూర్తి(చినబాబు) రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన సొంత నిధులతో రూ.4 లక్షల విరాళంగా అందజేసి కాలువ పూడికతీత పనులను ప్రారంభించారు. ఆయన అందించిన ఆర్థిక సాయంతో సుమారు పది రోజుల పాటుగా భారీ ప్రొక్లెయిన్ సహకారంతో రైతులు మురుగునీటి కాలువలోని పూడికతీత తవ్వకాలను పనులు పూర్తి చేశారు. విరాళం అందించి పనులను పూర్తిచేసిన చిన్నబాబును పలువురు అధికారులు, నాయకులు, గ్రామస్తులు, రైతులు అభినందిస్తున్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

ప్రజాశక్తి –కొవ్వూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పిజిఆర్ ఎస్ ద్వారా 10 అర్జీలు వచ్చాయని తెలిపారు. డివిజన్ అధికారులు ఈ కార్యక్రమంలో తప్పని పాల్గొని, ప్రజల సమస్యలను తీర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్‌కు కాకుండా ప్రజలు తమ అర్జీలను "1100 – మీకోసం కాల్ సెంటర్" కు ఫోన్ ద్వారా తెలపొచ్చన్నారు. ఈ కార్యక్రమం లో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

మలేరియా నిర్ధారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి – అంబాజీపేట

అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి మలేరియా మాసోత్సవం సందర్భంగా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు వైద్యాధికారి డాక్టర్ కె.ఎన్ శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం మలేరియా వ్యాధి నిర్ధారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. చలి వణుకుతో కూడిన జ్వరం అనాలసిస్ ద్వామల ద్వారా వ్యాపిస్తుందని రక్తపరీక్ష ద్వారా ఆర్డి టెస్ట్ ద్వారా మలేరియా నిర్ధారించవచ్చన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్స్ లనుద్దేసించి ప్రస్తుత తరుణంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ జ్వర పీడితులను గుర్తించి ఇంటింటా సర్వే చేసి కోవిడ్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ బి.అప్పారావు, పిహెచ్ డబ్ల్యూ ఎన్‌వి.శాంతకుమారి, ఎఎన్ఎంలు, హెల్త్ సిబ్బంది, ఆశా వర్కర్ లు పాల్గొన్నారు. **ఆలమూరు:** దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమని వైద్యాధికారులు డాక్టర్ అనంత రామకృష్ణ, డాక్టర్ లక్ష్మీ స్నేహ అన్నారు. సోమవారం చొప్పెల్ల, పెదపల్ల పిహెచ్‌సిల ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలో ఆరోగ్య, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి నుంచి 30వ తేదీ వరకు ఈ నెల రోజుల పాటు దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. అలాగే మలేరియాకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తలు దోమల నివారణ చర్యలు, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీటి గుంటలు ఎప్పటికప్పుడు పూడ్చుకోవడం చెత్తాచెదారం లేకుండా చేయటం రాత్రి పూట దోమలు కుట్టకుండా చూసుకోవడం ముఖ్యంగా వేపాకు పొగ ద్వారా దోమలు ఇళ్లలోకి రాకుండా నివారించుకోవచ్చు అన్నారు. దోమతెరలు వాడటం ద్వారా దోమల కుట్టకుండా జాగ్రత్త పడవచ్చునని తెలియచేశారు.అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎగ్జిక్యూటర్ రాజా హక్కుల, సిహెచ్ఒ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమా, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదపళ్ల పిహెచ్‌సి వద్ద వైద్యాధికారుల ర్యాలీ

పాసుపోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, రావులపాలెం మండలం, ఊబలంక గ్రామానికి చెందిన యార్లగడ్డ చిన్నారావు గారి కుమారుడు దిలీప్ అను నేను ది.25-05-2025 సం॥రం తేదీన నా పాసుపోర్టును నెం **X 5980837** తీసుకుని రావులపాలెం సెంటరుకు జిరాక్సు తీయించుకునే నిమిత్తం వెళ్లుచుండగా మార్గ మధ్యలో నా పాసుపోర్ట్ ఒరిజినల్ ఎక్కడో పడిపోయినది. నా పాసుపోర్టు కొరకు చుట్టు ప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

యార్లగడ్డ దిలీప్
ఊబలంక గ్రామం, రావులపాలెం మండలం
డా॥ ఆర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ : 9603971213

CHANGE OF NAME

I, VINAKOTI PADMAJA, D/o. Kamalanabham, previously called **BOBBILI PADMAJA** (Old Name), Now Changed my name from **BOBBILI PADMAJA** (Old Name) to **VINAKOTI PADMAJA** (New Name), Hence forth I will be called as **VINAKOTI PADMAJA,** D/o. KAMALANABHAM (New Name). for all purpose.

VINAKOTI PADMAJA
D/o. Kamalanabham
D.No. 7-158, Madhavarayunipeta
Tallarevu (V), Tallarevu (M)
Kakinada Dist., Cell : 9573727623

IN THE COURT OF THE I ADDL. JUNIOR CIVIL JUDGE; TIRUPATI
E.P.No. 166/2024
O.S.No. 444/2021
Between: A.Dinesh ...Decree Holder
AND
A.Srinivas ...Judgment Debtor
NOTICE TO JDR
A.SRINIVAS,
S/o Late A.Ramakrishna Rao,
Resident Address: D.No. 32-7-21, A4,
Sri Dathasai Apartments, Meraka Street, Near Anjaneya Swamy Temple, Rajahmundry
East Godavari District - 533 101, A.P.,
Please take notice that the above E.P. filed by the D.Hr for recovery of E.P. amount and the above E.P. is posted to 25-6-2025 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. Failing which matter will be decided ex parte.
(Order of the Court)
Date of hearing: 25-6-2025
KAVERIGARI NARAYANA
B.Com., M.L.,
ADVOCATE, TIRUPATI,
Cell: 80081 71739

వేలం ప్రకటన
In the Court of the Prinicipal Junior Civil Judge : Kakinada
E.P. 217 of 2019; in O.S. 488 of 2018
Between:
DEVAGURU CHANDRASEKHAR ..Decree Holder
and
CHENNA LAKSHMI PYDIRAJU ...Judgement-Debtor
DHr వేయించిన వేలం ప్రకటన
పై నెంబరు అమలు గ్రంథములో JDr వద్ద నుండి DHrకు రావలసిన డిక్రీ బాకీ గాను, JDr తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలపు యిస్తిహార్న షరతులకు లోబడి **ది. 17-06-2025 సం॥ తేదీన ఉదయం గం. 10-30 ని॥ల** లగాయతు పై కోర్టువారి ఎదుట బహిరంగ వేలం వేయుదురు. పాడుకొనదలచినవారు వచ్చి సదరు వేలం పాట నందు పాల్గొని పాడుకోవలెను. వివరముల కొరకు పై కోర్టు నజారత్ నందు గాని, DHr అడ్వకేట్ గారి ఆఫీసు నందు గాని తెలుసుకొనవలెను.
Shedule: East Godavari District, Samalkota Municipality, Samalkota Sub-Registry, Samalkota Village, pension lane, RCC Building, bearing D.No. 1-1-53/a, of an extent of 100 square yards is situated with in the boundaries: **East:** House of Chenna Kannamma; **West:** House of Gudupu Subbarao; **North:** Road; **South:** Godowns of Mattapalli people.
Within the above boundaries, an extent of 320.55 sq.yards of site along with RCC building with all easementary rights.
DHr Value : Rs. 2,00,000/-
Amina Value : Rs. 8,00,000/-
JDr Value : Not Given
అద్దేపల్లి మురళీధర్, డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ, సెల్: 9849170270

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్): కొవ్వూరు వారి కోర్టులో
E.P. No. 60/2019
O.S.No. 217/2011
శ్రీ చుండ్రు వీరవెంకట సూర్య ప్రభాకర చౌదరి, S/o భాస్కరరావు, హిందూ, వయస్సు 54 సం.లు, వ్యాపారం & వ్యవసాయం వల్ల జీవనం, R/o నేతాజీ నగర్, రాజమండ్రి. ..D.Hr.
మరియు
1. **మారెడ్డి వెంకట సత్యవతి** (Died),
2. **మారెడ్డి త్రినాధ అప్పారావు,** S/o లేటు సత్యనారాయణ, హిందూ, వయస్సు 39 సం.లు, వ్యాపారం R/o భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, ప.గో.జిల్లా.
3. **మారెడ్డి వినీల,** D/o లేటు సత్యనారాయణ, హిందూ, అవివాహిత, వయస్సు 35 సం.లు R/o భీమోలు గ్రామం, గోపాలపురం మండలం, ప.గో.జిల్లా ...J.D.r
వేలం ప్రకటన
పై నెంబరు E.P. గ్రంథములో D.Hr యొక్క డిక్రీ బాకీ వసూలు నిమిత్తం J.Dr లకు చెందిన E.P. షెడ్యూలు ఆస్తిని పై శ్రీ కోర్టు వారు **ది.18-06-2025**వ సం.తేదీన పై కోర్టులో ఉదయం గం.10-30 ని.లగాయితు వేలం వేయుదురు, ఆసక్తి కలవారు పాల్గొని పాడుకోవచ్చని, అందు యావత్తు సమాచారం శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నుండి గాని, D.Hr న్యాయవాది వారి ఆఫీసు నుండి కాని తెలుసుకోవచ్చునని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
వేలపుయిస్తిహారు దాఖలా షెడ్యూలు ఆస్తివివరం: ప.గో.జిల్లా, ప్రస్తుతం తూ.గో.జిల్లా, గోపాలపురం మండలం, వేగేశ్వరపురం సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసులో చేరిన, భీమోలు గ్రామ పంచాయితీ, భీమోలు రెవిన్యూ గ్రామంలో గల రి.స.నెం. 275రులో గల 2,3 J.Dr ల స్వాధీన హక్కు భుక్తములో వున్న జిరాయితీ మెరక **ఏ.13-54**ట్లలో **ఏ.1-00**ట్లు భూమికి హద్దులు : **తూర్పు :** మారెడ్డి త్రినాధ అప్పారావు గారి మిగిలిన భూమి, **ఉత్తరం :** కోట గట్టు, **పడమర :** బండారపు రాంబాబు గారి భూమి, **దక్షిణం :** భీమోలు నుండి గుడ్డిగూడెం రోడ్.
యీ హద్దుల మధ్యస్థమైన ఏ.1-00 ట్లు బూమి యావత్తు యీజిమెంటు హక్కులతో సహా.
D.Hr విలువ : **రూ. 12,00,000/-**
అమీనా విలువ : **రూ. 20,00,000/-**
S.RO. విలువ : **రూ. 12,00,000/-**
J.Dr విలువ : శ్రీ కోర్టు వారి J.Dr విలువ తెలియపర్చియుండలేదు.
శ్రీ కోర్టువారి అనుమతితో
శ్రీ సిహెచ్. వెంకటేశ్వరరావు
శ్రీ ఎస్.సుబ్బారావు
కొవ్వూరు D.Hr తరపు అడ్వకేట్లు
ది.02-06-2025 కొవ్వూరు